

ప్రయోజనాన్ని ఆశించి ఆయన ఎప్పుడూ ప్రమాణాలను నీరుగార్చలేదు. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొనడంలో ఆయనకాయనే సాటి.

# గొప్ప మనసున్న మనిషి

## డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి, హైదరాబాదు.

మాష్టరుగారు నాకు ప్రత్యక్షంగా గురువులు కాకపోయినా నాకు గురుతుల్యులు. భావ సామీప్యత మాత్రమేగాక మా గ్రామాలు కూడా ప్రక్క-ప్రక్కనే. నా పట్ల ఎంతో ఆదరాభిమానాలు కలిగి వుండేవారు. తండ్రి జన్మనిచ్చినా పునర్జన్మనిచ్చేది గురువులు. ఇది వారి పట్ల అక్షరాల వర్తిస్తుంది.

గంటల తరబడి విషయ చర్చ సాగుతుండడం జరిగేది. కాలం వృధా అనుకోకుండా, రాత్రిళ్ళు పొద్దుపోయినా ఎన్నో విషయాలు బోధిస్తుండేవారు. ఆయన జ్ఞాపకశక్తి అపారం. అనేక గ్రంథాలలోని అంశాలను ఉన్నది వున్నట్లుగా ఉదహరించి చెప్పేవారు. నాకేకాదు వారెవరికైనా ఎంతో సమయం కేటాయించి ఎన్నో వివరాలు చెప్పడం జరుగుతుండేది.

బోధనలో వారిది ప్రత్యేక బాణి. ఆవేశభరితంగా వుండేది. ఉన్నది వున్నట్లుగా చెప్పాలని వారి తపన. వారిది గొప్పమనసు. కపటం లేదు.

తన ఉపాధ్యాయ వృత్తి నిర్వహణ ప్రత్యేకత, విలక్షణతలు గోచరిస్తాయి. బ్రతకలేనివాడు బడిపంతులు అన్న సామెత వారిపట్ల వర్తించదు. వారికి ఈ వృత్తిపట్ల అపార గౌరవాభిమానాలు వుండేవి. తన హైస్కూలు చదువులనాటి హెడ్‌మాష్టరుగారైన దక్షిణామూర్తిగారి ఫోటో వారింటిలో వుంచేవారు. వారు పాఠాలు చెప్పేటప్పుడు సమయం ఎలా గడిచిపోయేదో తెలిసేదికాదు. అదనపు

క్లాసులు పెట్టకుండా సిలబస్ పూర్తి అయ్యేది కాదు. పరీక్షల కొరకే చదువులు అన్న అంశం వారిపట్ల వర్తించదు. సమయపాలన విషయంలో క్రమశిక్షణ విధిగా పాటించేవారు. అయితే బోధించే సమయంలో సమయం పాటించటం వారికి అసాధ్యమైన విషయమే. వృత్తిధర్మ నిర్వహణకే సమయాన్నంతా కేటాయించడంతో స్వంత పనులు వెనుకబడి పోయేవి. స్వంత పిల్లల చదువుల విషయంలో కూడా అదే జరిగిందేమో అనిపిస్తుంది. చాలాకాలం పాటు స్వంత యిల్లు కూడాలేదు. తీరా ఇల్లు కట్టుకునే సమయానికి అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకోవాల్సి వచ్చింది. విద్య, వృత్తులు వ్యాపారంగా పరిణమించిన ఈ కాలంలో వారు అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకున్నారన్నది నమ్మశక్యంకాదు.

తాను నమ్మిన విషయాలను చిత్తశుద్ధితో తూచా తప్పకుండా ఆచరించేవారు. నమ్మిన విషయాలు చెప్పేవారు. చెప్పినవే చేసి చూపించేవారు. త్రికరణశుద్ధి వీరి ధ్యేయం. ముందురోజుల్లో తలమీద పిలక వుండేదట. నాకు పరిచయం అయ్యేనాటికి ఆ పిలక లేదు. దానికి ఆధ్యాత్మికపరమైన కారణాలు చెప్పినట్లు నాకు గుర్తు. కాలేజి చదువులనాటికి త్రిపురనేని రామస్వామి చౌదరి, సూర్యదేవర రాఘవయ్య చౌదరిగార్లతో పరిచయం ఏర్పడినట్లున్నది. వారి భావాలు, రచనలు వీరిని ప్రభావితం చేయడం జరిగింది. తలమీద పిలకలేదు. రేషనలిస్టు భావాలు చోటుచేసుకున్నాయి. నిష్కపట జీవితానికి ఇంతకన్న ఏ నిదర్శనాలు కావాలి.

భాష విషయానికి వస్తే వారికి గ్రాంథిక భాషపై మక్కువ. ఆ రోజుల్లో గిడుగు రామమూర్తి గారి లాంటివారు వాడుక భాషను గూర్చి ఉద్యమ స్థాయిలో ప్రచారం సాగిస్తుండేవారు. భావకవులు రంగ ప్రవేశం చేశారు. మాస్టరుగారికి వీరి పట్ల సానుభూతి లేదు సరికదా ఈ ఉద్యమాలను నిరసిస్తూ పుస్తకం ప్రచురించాలని ప్రయత్నం చేశారు. ఆ వ్రాత ప్రతిని నేను చూడటం జరిగింది. ఎందుకు ప్రచురించలేదో నేను చెప్పలేను.

ఇంగ్లీషు విషయంలో కూడా నిశ్చితాభిప్రాయాలున్నాయి వారికి. కింగ్స్ ఇంగ్లీషు ప్రామాణికంగా తీసుకొనేవారు. ఉచ్చారణ విషయంలో

చాలా శ్రద్ధ కన్పించేది. తెలుగు విషయంలో ఉచ్చారణలోపాలను మొగమాటం లేకుండా ఎత్తి చూపెట్టేవారు.

జీవితాశయంలోగాని, పదాల మూలార్థాలను పరిశీలించడంలో గాని రాజీపడని వ్యక్తి. నైతిక విషయాలపట్ల కూడా ఏనాడూ రాజీపడి ఎరుగరు. ప్రయోజనాన్ని ఆశించి ఆయన ఎప్పుడూ ప్రమాణాలను నీరుగార్చలేదు. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొనడంలో ఆయనకాయనే సాటి. తెలుగు భాషావిషయంలో త్రిపురాన సూర్య ప్రసాదరావుగారిని ఎంతగానో మెచ్చుకునేవారు. వారి వ్రాతప్రతులను నేను చూసాను. ఎక్కడా కొట్టివేతలు లేవు. నూరు పద్యాలదాకా మనస్సులో అనుకొని, చంధస్సు పరమైన కొట్టివేతలు కూడా మనస్సులోనే పూర్తి చేసిన తరువాత కాగితంపై కలం పెట్టేవారట సూర్యప్రసాదరావుగారు. మాస్టరుగారు ఇవన్నీ చెప్పేవారు.

నమ్మిన విషయాలను తూచా తప్పక ఆచరణాత్మకంగా చేసి చూపెట్టేవారనడానికి స్వంత పిల్లల పేర్లే మంచి నిదర్శనం. వారికి తెలుగుభాష చాలా ఇష్టం. తాను మెచ్చిన తెలుగు పండితుల పేర్లు పిల్లలకు పెట్టి ముద్దుగా పిలుచుకొనడం జరిగింది. చిన్నయసూరి, రామరాజ భూషణుడు ఇత్యాది తన పిల్లల పేర్లు ఇందుకు నిదర్శనమే.

మాస్టరుగారు అభిమానధనులు. వృత్తిపరంగా చాలాకాలం లెక్చరర్‌గా పనిచేయడం జరిగింది. చివరి రోజులలో ప్రిన్సిపల్‌గా పనిచేశారు. అర్హతలున్నా ఆదరణే ప్రధాన అర్హతైన ఈ రోజులలో అర్హులకే పదవులు దక్కవుగదా. అయినా పదవుల కొరకు గాని, గుర్తింపు కొరకుగాని ఆయన తాను నమ్మిన నియమాలను ఏ రోజున ఉల్లంఘించలేదు.

వారు విద్యకు, సమాజానికీ స్వలాభాపేక్ష లేకుండా నిండు మనస్సుతో ఎనలేని సేవ చేసిన మహామనీషి. ఆదర్శప్రాయుడు. నన్ను ఆంతరంగికుడుగా ఆదరించేవారు. అది నా అదృష్టం. త్రికరణశుద్ధిగా వారు సాగించి జీవించిన విధానం అందరికీ ఆదర్శప్రాయం. వారు గొప్ప మనసున్న మనిషి.